వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 143
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఫిబ్రవరి 28, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



6లో..

ప్రతిభకు ప్రతీక..

## డాక్టర్ వైద్యం గౌతమ్

- మనసంతాసేవే..
- ఆపన్నులకు అండ
- పేద ప్రజలకు అభయ హస్తం
- ఉన్నంతలో సాయం చేసే మంచితనం



# పుస్తకం హస్తభూషణం

ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ బ్రహ్మానందాన్ని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే స్ప్రింగ్ స్ప్రీ–2025 ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనను కలసి ప్రసిద్ధ "శంకర్ నారాయణ నిఘంటువు"(డిక్షనరీ)ని బహుకరించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ తాను కూడా ఏ పెద్ద వ్యక్తిని కలిసినా బొకేలు, శాలువాలు కాకుండా కొన్ని సంవత్సరాలుగా ఓ మంచి పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వటం అలవాటు చేసుకున్నానని, ఎంత ఖరీదైన బొకే కూడా శాశ్వతంగా ఉండదని అదే పుస్తకం అయితే జీవిత కాలం భద్రంగా ఉంటుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఈ పద్ధతి నచ్చితే ప్రతి ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని ఆకాంక్షించారు. – వరంగల్ వాయిస్, నిట్ వరంగల్



2లో..

## సంత్ సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి

- కలెక్టర్ దివాకర టీఎస్



8లో..

## మామునూర్ ఎయిర్ పోర్ట్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




# అందరి చూపు.. హైదరాబాద్ వైపు

TELANGANA

- విశ్వసుందరి పోటీలకు వేదికైన తెలంగాణ
- 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం
- మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె
- వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొననున్న దేశాలు

మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీమణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. 'మిస్ వరల్డ్ ఫెస్టివ్-2025' పేరిట మే 7నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీలకు ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన అందెగత్తెలు 'విశ్వసుందరి' కోసం పోటీపడనున్నారు. అయితే 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణను ఎంచుకున్నట్లు మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ, టూరిజం, కల్చరల్ సెక్రటరీ స్మితా సబర్వాల్ ప్రకటించారు. దీంతో ప్రపంచ దేశాల చూపు ఒక్కసారిగా హైదరాబాద్ వైపు మరలింది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

# అందరి చూపు.. హైదరాబాద్ వైపు



- విశ్వసుందరి పోటీలకు వేదికైన తెలంగాణ
- 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం
- మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె
- వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొననున్న దేశాలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ప్రపంచం దేశాలన్ని హైదరాబాద్ వైపు చూపుతిప్పుకునే రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక 72వ మిస్ వరల్డ్ పోటీలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణులు అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టి పోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

### అద్వితీయ వేడుక..

ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసిన నేపథ్యంలో ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ లో నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంటోంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్ధమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయ వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.



### మే 31న గ్రాండ్ ఫినాలె..

ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటున్నాయి. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతోంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభమై మూడు వారాల పాటు కొనసాగనున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది.

### తెలంగాణ జరూర్ ఆనా..

తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారసత్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ పెరుగుతోంది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది.






# సంత్ సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి

**◆ కలెక్టర్ దివాకర టీఎస్**

**వరంగల్ వాయిస్, ములుగు :** సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే ఆ మహనీయుడికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ వారి 286 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంత్ సేవాలాల్ జయంతి పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ 18వ శతాబ్దంలోనే అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారని అన్నారు. ఆయన పరమపదించి దాదాపు రెండు వందల సంవత్సరాలు దాటినా కూడా సేవాలాల్ మహారాజ్ ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అహింసా మార్గాన్ని అవలంభించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటుపడాలని, మనం ఏం చేయాలన్న వారి స్ఫూర్తి తీసుకొవాలన్నారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరానికి సైతం అందేలా కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తెరిగి ముందుకు సాగాలని ఆయన సూచించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారా జాతి అభివృద్ధికి, వారి అభ్యున్నతికి 22 సూత్రాలను అందించారని అన్నారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవిందనాయక్ మాట్లాడుతూ, బంజారా జాతి సేవాలాల్ చూపిన విధంగా ఏకతాటిపై ఉండాలని, మద్య మాంసాలకు దూరంగా వుండాలని, ఆయన ఆశయాలను సాధించి బంజారా సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో బంజారా ముఖ్య స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ నగరంలోని 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట వాణి హై స్కూల్ లో శుక్రవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల సైన్స్ ఎగ్జిబిట్ ప్రదర్శించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ఎగ్జిబిట్స్ ను తిలకించారు. తొలుత పాఠశాల ప్రిన్సిపాల్ సామల స్వరూప ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించే చిన్నారులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వరూప మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సైన్స్ లో ప్రావీణ్యం పొందడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు అన్నారు. రానున్నది ఏఐ కాలమని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా విద్యార్థులు చిన్నప్పటినుండే సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో వాణి విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సామల స్వరూప, కరస్పాండెంట్ సామల సుధాకర్, డైరెక్టర్లు మురళీకృష్ణ, సాయి కృష్ణ, కొమ్మినేని భూపాలరావు, చీఫ్ అడ్వైజర్ టీఆర్ఏ ఎస్ యంఏ , పల్లం పద్మా రవి 32వ డివిజన్ కార్పొరేటర్, పాఠశాల సిబ్బంది పాల్గొనీ విద్యార్థులు చేసిన ప్రాజెక్టును పరిశీలించి వారి ప్రతిభను కొనియాడారు. ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, ఫిబ్రవరి28, 2025

# లింగ వివక్షతను ధైర్యంగా ఎదుర్కోవాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** సమాజంలో లింగ వివక్షత, హింసలను ఆడపిల్లలు ధైర్యంగా ఎదుర్కోనే శక్తి సామర్థ్యాలు, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ వన్నం స్వర్ణలత అన్నారు. శుక్రవారం మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో భేటి బచావో భేటి పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ మగ పిల్లలు ఆడపిల్లలను గౌరవించాలని, వారికి ఏదైనా సమస్య ఉంటే అండగా నిలవాలన్నారు. ఆడ, మగ అనే తేడా చూడకుండా చిన్నతనం నుంచి మంచి విలువలు నేర్చుకొని భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ఆడపిల్లల పైన స్త్రీల పైన జరుగుతున్న దాడులు వారికి ఉండవలసిన హక్కుల గురించి పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి వివరించారు. లింగ సమానత్వం, వివక్షత ,లైంగిక నేరాల నుంచి పిల్లల్ని రక్షించే చట్టం ,సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్ గురించి పిల్లలకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థినిల చేత ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ మెరుగు మానస, పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, బత్తుల రవీందర్, అంగన్వాడీ టీచర్లు భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలర్చుకోవాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని శాస్త్రీయ దృక్పథాలను అలవర్చుకోవాలని ఆత్మకూరు ఎస్సై తిరుపతి పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరీసా పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ తిరుపతి విద్యార్థులు స్వతహాగా రూపొందించిన సైన్స్ పరికరాలను, బిట్స్ ను పరిశీలించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల సైన్స్ టీచర్లు శ్రీదేవి, శంకర్ బాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జాయిస్, కరస్పాండెంట్ సిస్టర్ లిజ్వేరి, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోస్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి

## జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కె. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ లో అంతర్జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ ను డాక్టర్ కె. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన పరిజ్ఞానంతో కొత్త విషయాలను ఆవిష్కరించాలన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీవాణి, ఎస్సై రాజేష్ రెడ్డి, ట్రస్మా డివిజన్ అధ్యక్షులు పాశికంటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జాంగిర్, మాజీ జడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే తత్వంతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

## తహసీల్దార్ నాగరాజు




**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రశ్నించే తత్వంతోనే కొత్త ఆవిష్కరణలు జరిగి తద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని నడికూడ మండల తహసిల్దార్ జి.నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలోని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఉపాధ్యాయుల సహకారంతో 42 వర్కింగ్ మోడల్ ప్రయోగాలు చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ స్రవంతి, ఉపాధ్యాయులు జయ, శివ చేతన్, సుమలత, శ్రవణ్, సుభాని, శ్రీనివాసరెడ్డి, శారద, తిరుపతి, అశోక్, రాజు నాయక్, శివకుమార్, కృపమ్మ, కుమారస్వామి పాల్గొన్నారు.

# డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి

## పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం డిమాండ్




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ డిటెన్షన్ విధానాన్ని పరిశీలించి పూర్తిగా డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని పీడీఎస్ యూ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్ కుమార్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో చదువుతున్న విద్యార్థులు డీటెయిల్స్ విధానం వల్ల పై చదువులు చదవడానికి అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. క్రెడిట్ ఆధారంగా బ్యాక్ లాగ్ ఉన్న విద్యార్థులపై తరగతులకు ప్రమోట్ చేయకుండా ఉన్న డిటెన్షన్ విధానంతో పేద, బడుగు, బలహీన విద్యార్థుల డ్రాపౌట్ సంఖ్య పెరుగుతుందని తెలిపారు. దీంతో విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయని తక్షణమే యూనివర్సిటీ డిటెన్షన్ విధానాన్ని పునర్ పరిశీలించి పూర్తిగా డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. విద్యార్థుల డ్రాప్ అవుట్ సంఖ్య తగ్గేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ యూనివర్సిటీ నాయకులు వెంకట్, ఠాగూర్, ప్రభాస్, రాజు, నివేద, వైష్ణవి, సింధుజ పాల్గొన్నారు.

# సైన్స్‌ఫేర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశాయిపేట రోడ్డులో గల ఒయాసిస్ పాఠశాలలో శుక్రవారం సైన్స్‌ఫేర్ కార్యక్రమం ఒయాసిస్ విద్యా సంస్థల చైర్మన్ డా.జే.ఎస్ పరంజ్యోతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్లూరి కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ క్రిష్టొఫర్ సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకురావాలన్నారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్తపుంతలు తొక్కుతోందని సామాన్యుల కష్టాలను తీర్చే దిశగా పరిశోధనలు పురోగతి సాధిస్తున్నాయని తెలిపారు. ఎంజీఎం వైద్య నిపుణులు, పాఠశాల పూర్వ విద్యార్థులు డా.ఎ.నాగరాజు, పాఠశాల చైర్మన్ డా.జే.ఎస్.పరంజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిపెంచి వారి ఆలోచనలకు సానపెట్టి నూతన ఆవిష్కరణలు చేసే దిశగా సైన్స్ ఫెయిర్ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ట్రెజరర్ జన్ను అరుణ పరంజ్యోతి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఉపాధి కల్పించాలి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** దుగ్గొండి మండలం చాపల బండ గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించిన ఆమె, ఉపాధి హామీ కూలీలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్ణాల కుంటలో చేపడుతున్న ఈజీఎస్ పనులలో భాగంగా నిర్మిస్తున్న ఫిష్ పాండ్ తవ్వకాలను పరిశీలించిన కలెక్టర్, కూలీలకు అన్ని సౌకర్యాలు అందించడంతో పాటు అర్హులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే ఉన్న బావులను పూడికతీత చేయాలని డీఆర్డీఓకు, తాగునీటి బావులు లేని ప్రాంతాల్లో వాటిని అద్దెకు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, రైతులకు అవసరమైన ఫామ్ ప్యాండ్స్, పాడి పశువుల పెంపకం, చేపల పెంపకం, తోటల సాగు వంటి పథకాలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో నేల రకాన్నిబట్టి వివిధ పంటలు సాగు చేయాలని రైతులను ప్రోత్సహించారు. రైతులు తమకు అవగాహన ఉన్న పంటలు, పాడి, ఫిష్ ఫ్యాండ్స్ వంటి ఉపాధి అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభుత్వ పథకాలు మరింత ప్రభావవంతంగా అమలవుతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం చాపల బండ తండాలో నాగపురి రాజేందర్ అనే రైతు ఎకరం భూమిలో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించి, సాగు విధానాన్ని తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో మరింత పురోగతి సాధించాలని రైతులకు సూచించిన కలెక్టర్, ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ కౌశల్యా దేవి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎంపీడీవో అరుంధతీ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వరంగల్ లోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లోని విద్యార్థులు సైన్స్, గణితం, సాంఘికం, తెలుగు, హిందీ, ఆంగ్లం, కంప్యూటర్, క్రీడలు, సంగీత సాహిత్యాలకు సంబంధించిన పలు రకాల నమూనాలను తయారు చేసుకొని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ డి.హరనాథ్ తిలకించి, విద్యార్థులు తయారు చేసుకొని వచ్చిన ప్రయోగాలపై ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.సరితారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల వల్ల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలలో ఎంతో అభివృద్ధిని సాధిస్తారని తెలియజేశారు. సెన్స్ విభాగానికి చెందిన క్రాంతి కుమార్, తిరుపతి, సరిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కివి పాఠశాలలో సైన్స్ అండ్ కల్చరల్ ఎగ్జిబిషన్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని కరీమాబాద్ ప్రాంతంలో గల కివి పాఠశాలలో సైన్స్ అండ్ కల్చర్ ఎగ్జిబిషన్ ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి విద్యార్థులు తయారు చేసిన 200 ఎగ్జిబిట్స్ ను ప్రదర్శించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన గ్జిబిట్స్ ఆలోచింపజేసే విధంగా ఎంతో సృజనాత్మకతతో ఉన్నాయన్నారు. స్మార్ట్ బోర్, మల్టీ పర్పస్ అగ్రికల్చరల్ టూల్, వెజిటబుల్ వేస్ట్ మేనేజ్మెంట్, సముద్ర నీటి శుద్ధి విధానం, కల్లు గీత కార్మికుల కోసం పాం ట్రపెర్ స్మార్ట్ సెలైన్ స్టాండ్, స్మార్ట్ సింక్, స్మార్ట్ బస్, పండుగల విశిష్టత తెలిపేలా మన పండుగలు సంప్రదాయాలు చూపించారన్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసేలా సైన్స్ ఫెయిర్లు ఉపయోగపడతాయని తెలియజేశారు. పిల్లలకు సైన్స్ పట్ల వారి రోజువారి జీవితంలో సైన్స్ ఉపయోగపడేలా సైన్స్ ఉపయోగించుకోవడం ఎలా అనేది కూడా అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర, అధ్యాపక బృందం దివ్య, మంజుల, స్వాతి, రవితేజ , శాంతకుమారి, శ్రీవాణి, సరిత, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ గర్భాధారణతో మేలు జాతి దూడలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భాధారణ చేయడం వలన పశువులకు మేలు జాతి దూడలు విస్తృతంగా అభివృద్ధి చెందుతాయని రేగొండ పశు వైద్యాధికారి డాక్టర్ మైథిలి అన్నారు. రేగొండ మండలం రావులపల్లె గ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు చెందిన పశువులకు ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ మైథిలి ప్రారంభించి, మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులకు చెందిన పశువులకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమగర్భధారణ చేయడం వల్ల మేలుజాతి ఆడ దూడలు విరివిగా వృద్ధి చెందుతాయని, దూడలకు నట్టల నివారణకు మందులను త్రాగించుకోవాలని డాక్టర్ మైథిలి సూచించారు. ఈ వైద్య శిబిరంలొ 22 పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలొ గోపాలమిత్ర సూపర్ వైజర్ ప్రకాష్ రెడ్డి, గోపాలమిత్రులు రవీందర్ రెడ్డి, కిషన్, వెంకట్రాజం గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులు ఏసీపీ భోజరాజు, ఎస్.ఐ లు సాధిక్ అలీ, రవీందర్, మధు బాబులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీసేవలను నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని పదవీ విరమణ తర్వాత కూడా మీ గౌరవం తగ్గదని, ఆరోగ్యం పై శ్రద్ద వహించాలని, నిత్యం వ్యాయామం కోసం కొద్ది సమయాన్ని కేటాయించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సురేష్ కుమార్, ఏసీపీలు నాగయ్య, సురేంద్ర, సత్యనారాయణ, ఆర్ఐలు సతీష్ , శ్రీనివాస్, స్పర్జన్ రాజ్, ఆర్ఎస్ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పరకాల పట్టణాభివృద్ధే ఎమ్మెల్యే రేవూరి లక్ష్యం

■ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణాభివృద్ధే ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి లక్ష్యమని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రేవూరి అదేశాల మేరకు పలు వార్డులలో(1,2,3)లలో పరకాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పకొయ్యడ శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్య అతిథిగా పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణతో పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటెరు రామ్మూర్తి, 1,2,3 వార్డుల మాజీ కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, కుంకుమేశ్వర అలయ కమిటీ చైర్మన్ కొలుగురి రాజేశ్వరరావు, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయకమిటి సభ్యులు సోదా రామకృష్ణ, పావుశెట్టి వెంకన్న, బండి సదానందం, ఎండీ రంజాన్ అలీ, నల్లెళ్ల అనిల్ కుమార్, దుబాసి వెంకటస్వామి, పసుల రమేష్, చిన్నల గొనాథ్, బుర్ర రాజమోగిలి, బండి సదానందం గౌడ్, నల్లెల అనిల్, డాక్టర్ మడికొండ శీను, పాలకుర్తి శ్రీనివాస్, వార్డ్ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



➲ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**వరంగల్ వాయిస్, కేసముద్రం :** జిల్లావ్యాప్తంగా తాగునీరు సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ సంబంధిత యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కేసముద్రం మండలం, రంగాపురం గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందించుటలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వేసవికాలం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందించే తాగునీరు సరఫరాకు ఆటంకం లేకుండా ఇప్పటికే సంబంధిత సిబ్బంది అందరికీ తగు ఆదేశాలు జారీ చేశామని, చిన్న చిన్న మరమ్మత్తులు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని, మున్సిపల్ పరిధి, గ్రామపంచాయతీ పరిధిలలో మిషన్ భగీరథ, ఇతర హ్యాబిటేషన్స్ ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ప్రతిరోజు గృహాలకు, హాస్టళ్లకు షెడ్యూలు ప్రకారం మంచి నీటిని సరఫరా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ సిబ్బందితో ప్రతిరోజు సమన్వయం చేసుకుంటూ ఉండాలన్నారు. కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ లక్ష్మారెడ్డి సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం



**వరంగల్ వాయిస్, దామెర :** సీతారాంపురం, దుర్గంపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీలతో కూడిన ప్రజా పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన చేపట్టినందుకు గ్రామ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, జిల్లా నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, సదిరం పోచయ్య, జక్కుల రవీందర్, దూరిశెట్టి భిక్షపతి, కూనమళ్ల రవీందర్, మండల యూత్ అధ్యక్షుడు నల్ల సుధాకర్ హాజరయ్యారు. సీతారాంపురం గ్రామానికి చెందిన బొమ్మినేని మల్లారెడ్డి, బాబు, అనిల్, రాజు యాదవ్, మాజీ ఉప సర్పంచ్ కావట్టి రవి, తుత్తూరు ముత్తయ్యతో పాటు దుర్గంపేట గ్రామం నుంచి దాసి శ్రీకాంత్, లింగారెడ్డి, ఆవాల రవీందర్, నర్సిరెడ్డి, ముత్యాల జుగున్, గజ్జల కరుణాకర్, కూనమల్ల దశరథం, ప్రకాష్, ముద్రకోల భిక్షపతి, సలేంద్ర పృథ్వీ, గడ్డం సదానందం, శిల్లా ఎల్లా స్వామి, రామదాస్ ముదురుకోల, పాషా, చెప్పు సారంగం, రవి, శ్రీను, ఎండీ చోటా మియా, పెద్దరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



● జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మార్చి 21 నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో మొత్తం 12010 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఇందుకుగాను 67 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 తేదీ వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు 67మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67మంది డిపార్ట్మెంట్ అధికారులు, 67 మంది సిట్టింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో 6339 మంది బాలురు, 5671 మంది బాలికలు మొత్తం 12010 విద్యార్థినీ,విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని విభాగాల శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేస్తున్న నిర్వహణ ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఎల్పీఓ గంగాభవాని, పోస్టల్ అధికారి పాపాజీ, ఆర్టీసీ ఆర్ఎం ధరమ్ సింగ్, ఏటీవో అన్వర్ హుస్సేన్, విద్యుత్ శాఖ అధికారి గంగారెడ్డి, ఎంవీఐ వేణుగోపాల్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ఆటంకాలు కల్పిస్తే సహించం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేట ఆర్వోబీ పనుల పురోగతిపై పరిశీలన
- ఛత్తీస్ గఢ్ నుంచి రావాల్సిన బ్రిడ్జి సామగ్రిపై ఆరా



**వరంగల్ వాయిస్, కాజీపేట :** అభివృద్ధి విషయంలో ఆటంకాలు కల్పిస్తే సహించేది లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కాజీపేట ఆర్వోబీ పనులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించి పనులలో జరుగుతున్న జాప్యానికి గల కారణాలు నేరుగా పరిశీలించారు. ఛత్తీస్ గఢ్ నుంచి రావాల్సిన మెటీరియల్ ఆలస్యం కావడంతో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్ తెలుపగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి బ్రిడ్జి నిర్మాణ పనులను వివరించి వేగవంతం చేయాలని తెలియజేస్తానని తెలిపారు. కాజీపేట బ్రిడ్జి త్వరలోనే అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కాజీపేట బస్ స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు



సిద్ధం చేశామని, కేంద్ర రైల్వే శాఖ నుంచి అనుమతులు రాగానే పనులను వేగవంతం చేస్తామన్నారు. గతంలో కాజీపేట బ్రిడ్జి పనులు ఏ దశలో ఉన్నాయో ఇప్పుడు ఏ దశకు చేరుకుందో ప్రజలు గుర్తించాలని కోరారు. ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. గడిచిన ఏడాదికాలంగా నియోజకవర్గంలో ఎటువంటి భూ కబ్జాలు లేవని, అల్లర్లు తావులేదని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మేము సాగుతున్న క్రమంలో ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలో ఉన్నాయని తెలిపారు. సొంత పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్టకు వ్యతిరేకంగా చేస్తున్న వారిని ఉపేక్షించేది లేదన్నారు. పార్టీకి నష్టం వాటిల్లే పరిస్థితి వస్తే జిల్లా అధ్యక్షుడిగా సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు అభివృద్ధికి సహకరించాల్సిన బాధ్యత మరిచి ప్రభుత్వంపై, పార్టీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై గుంతను పూడ్చాలి

## బీజేపీ జిల్లా కార్యదర్శి జడ సతీష్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండలంలోని కట్ర్యాల గ్రామంలో జాతీయ రహదారిపై వాటర్ పైప్ లైన్ పగిలి ఏర్పడ్డ గుంతను వెంటనే పూడ్చాలని బీజేపీ జిల్లా కార్యదర్శి జడ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 15 రోజుల నుంచి రోడ్డుపై ఏర్పడ్డ గుంతను అధికారులు ఇప్పటివరకు పూడ్చే ప్రయత్నం చేయలేదన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే పట్టించుకోని గుంతను పూడ్చి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని సతీష్ అధికారులను డిమాండ్ చేశారు.

# డిటెన్షన్ విధానం సడలించాలి

## కేయూ విద్యార్థి సంఘాల నేతలు



**వరంగల్ వాయిస్, కేయూ :** డిగ్రీ విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని సడలించాలని యూనివర్సిటి విద్యార్థి సంఘాల నాయకులు బృందం కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.ప్రతాప్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ డిటెన్షన్ విధానాన్ని కొనసాగించడం వల్ల విద్యార్థుల డ్రాప్ అవుట్ సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతుందని దీనివల్ల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో విద్యకు దూరమవుతున్నారన్నారు. ఈ విషయంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో ఈ విద్యా సంవత్సరంలో డిటెన్షన్ విధానాన్ని సడలించడం జరిగిందని, అదే మాదిరిగా మన కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇదే విధానాన్ని అమలు చేయాల్సిందిగా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఆరెగంటి నాగరాజు గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి, హకీమ్ నవీద్ ఏఐఎస్ బీ రాష్ట్ర కన్వీనర్, అలువాల కార్తీక్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి, కలకుట్ల సుమన్ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు , బొచ్చు తిరుపతి మాదిగ ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, డాక్టర్ మధు ఎంఎస్ఎఫ్ కేయూ ఇంచార్జి, ఎల్తూరి సాయి ఎస్ఎస్ యూ జిల్లా అధ్యక్షులు, బోస్క నగరాజు వికలాంగుల సంఘం ఇంచార్జి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య విద్యార్థులు తయారుచేసిన వివిధ సైన్స్ ఎగ్జిబిట్లను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పంచకం నర్సయ్య మాట్లాడుతూ సైన్స్ లేనిది జీవితం లేదని, ఆధునిక ప్రపంచంలో మనిషి నెగ్గాలంటే సైన్స్ కావాలని అన్నారు. ప్రముఖ భౌతిక శాస్త్ర పరిశోధకుడు, నోబెల్ బహుమతి గ్రహీత, భారతరత్న చంద్రశేఖర్ వెంకట రామన్ తను కనుగొన్న రామన్ ఎఫెక్ట్ పరిశోధనా ఫలితాన్ని 1928 ఫిబ్రవరి 28న ధ్రువీకరించాడు. భారత ప్రభుత్వం 1987వ సంవత్సరం నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుతున్నదని తెలిపారు. సీవీ రామన్ తన మేధో శక్తితో ఎన్నో ప్రతిష్టాత్మక పరిశోధనలు చేసి భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు అశ్విని, నర్మద, దివ్యశ్రీ, రజిత, సుస్మిత, స్పందన, సిమ్రాన్, ఆఫ్రీన్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్రంలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్ రంజిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నప్పటికీ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వకుండా ముఖ్యమంత్రి ఢిల్లీ ప్రయాణాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని, దీన్ని ఆసరాగా తీసుకుని కార్పొరేట్ శక్తులకు మద్దతు ఇచ్చే బీజేపీ, అవినీతి పాలన సాగించిన బీఆర్ఎస్ పార్టీలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ వైఫల్యాలను వినియోగించుకుంటున్నాయని తెలిపారు. ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి అధికారం అందించినా, పాలకులు ప్రజల విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఎంసీపీఐ(యూ) హెచ్చరించింది. రాష్ట్రంలో ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాదారులు ఆక్రమిస్తున్నారని, అలాగే పేద రైతుల పంట పొలాలను పరిశ్రమల స్థాపన పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం ఉత్సాహం చూపుతోందని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీలు ప్రైవేటీకరణ, కార్పొరేట్ విధానాలకు ఎర్ర తివాచీ పరచిన విధానాన్ని ప్రజలు తిరస్కరించారని, గతంలో కాంగ్రెస్ పాలనకూ వ్యతిరేకత వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఇదే విధానం కొనసాగిస్తే తెలంగాణ ప్రజలు ప్రభుత్వం తీరు సహించరని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, రానున్న బడ్జెట్‌లో విద్య, వైద్యం, ఉపాధి, మహిళా సంక్షేమ రంగాలకు కనీసం 40% నిధులు కేటాయించాలని, పేద ప్రజలు నివసిస్తున్న ప్రభుత్వ భూములకు ఇండ్ల పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని పునరుద్ధరించాలని, కార్పొరేట్ విద్యా, వైద్యాన్ని రద్దు చేసి, ప్రైవేటు విద్యా, వైద్య వ్యవస్థను ప్రోత్సహించే బడ్జెట్ విధానాన్ని మార్చాలని, మిర్చి, పసుపు రైతులను ఆదుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి, మద్దతు ధరతో పాటు బోనస్ ప్రకటించాలన్నారు. బీసీ జనాభా నిష్పత్తి మేరకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించేందుకు తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని, స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌ను 50 శాతానికి పెంచాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) మండల సభ్యులు సురేష్, రవి, సిద్దు, లత పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ శాంతి పండుగ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ శాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వడ్డేపల్లిలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులైన కుంట రవికుమార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పగడాల సరళాదేవి, ప్రొఫెసర్ విజయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథి పగడాల సరళా దేవి ప్రపంచ శాంతి పండుగ గురించి దాని ఆవిర్భావం, అవశ్యకత గురించి వివరించారు. అలాగే మరో ముఖ్యఅతిథి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వడ్డేపల్లి పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ విజయబాబు, శాంతి స్థాపనను వాటిలో విద్యార్థుల ప్రాధాన్యతను గురించి తెలిపారు. అనంతరం బాల శాంతి దూతలుగా చిన్నారులు లౌక్య చిన్ముద్ర, అర్జున్ లకు అవార్డులను బహుకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంట రవికుమార్ తో పాటు ఉపాధ్యాయులు కందగట్ల సురేష్, బొమ్మినేని నరసింహారెడ్డి, కామిరెడ్డి ప్రత్యూష, బూర కృష్ణవేణి, గోవర్ధన రాజగోపాలచారి, మిట్ట మోహన్రెడ్డి, మామిడి విమలబాయి, వల్లపురెడ్డి సరళ, రుద్రంగి పృథ్వీ, చాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

గద్దం
కేశవమూర్తి






# ప్రతిభకు ప్రతీక..
# డాక్టర్ వైద్యం గౌతమ్



**అంతులేని ప్రతిభ ఆయన సొంతం.. ఉన్నంతలో ఇతరులకు సహాయ పడాలన్నదే లక్ష్యం. వైద్యం కోసం వస్తే నేనున్నా నంటూ మానవత్వంతో స్పందించే వైద్యుడాయన. కఠోర శ్రమకు, అకుంఠిత దీక్షకు ఆయన చెరగని చిరునామా. వ్యాధిగ్రస్తులకు ఆధునిక వైద్యం గురించి అవగాహన కల్పించడంతోపాటు ఆరోగ్య సలహాలు అందిస్తున్న ఆయనే ప్రముఖ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ వైద్యం గౌతమ్.**

- **మనసంతాసేవే..**
- **ఆపన్నులకు అండ**
- **పేద ప్రజలకు అభయ హస్తం**
- **ఉన్నంతలో సాయం చేసే మంచితనం**

కాకతీయుల గడ్డపై యువ వైద్యుడిగా వైద్యం గౌతమ్ మంచి పేరుంది. ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి సమయంలోనూ ప్రాణాలకు తెగించి ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదించారు. ఆపత్కాలంలో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ నేనున్నాంటూ అభయ హస్తంతో ముందుకు సాగుతున్నారు. మనిషికి ఏదైనా అనారోగ్యం వస్తే వైద్యుడు మొదట నాడీ పట్టుకుంటారు. అది కొట్టుకునే తీరు (పల్స్ రేట్ ) ను గమనించి వెంటనే వ్యాధిపై ఒక అంచనాకు వస్తారు. ఇదే విధంగా డాక్టర్ గౌతమ్ కూడా రోగులకు, అవసరార్థులకు అందుబాటులో ఉంటూ చికిత్సలు అందిస్తున్నారు. ఎంజీఎం ఆసుపత్రికి వచ్చే వారికి వైద్య సలహాలు, సూచనలు చేస్తూ రోగాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నారు. వైద్య చికిత్సలో డాక్టర్ గౌతమ్ నేర్పు, ఓర్పులను ప్రదర్శిస్తూ ఓరుగల్లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

## కుటుంబ నేపథ్యం..

హనుమకొండలో వైద్యం సవిత–రాజగోపాల్ దంపతులకు 1989 జనవరి 28న గౌతమ్ జన్మించారు. రాజగోపాల్ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖలో డీఈగా పనిచేసే రిటైర్డ్ అవ్వగా, సవిత వరంగల్ లోని ఆంధ్ర బాలిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. అక్క స్వాతి ఎంఎస్ పూర్తి చేసి అమెరికాలో స్థిరపడ్డారు. వీరి పూర్వికులది ప్రస్తుత జనగామ జిల్లా నర్మెట్ట మండలం అమ్మాపూర్. సవిత–రాజగోపాల్ ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో వీరి కుటుంబం, పిల్లల చదువు కోసం హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో స్థిరపడ్డారు. వీరి కృషి వల్ల కుటుంబం సరస్వతీ నిలయంగా మారింది. హైదరాబాద్ మలక్ పేటకు చెందిన మస్న పద్మ, చక్రపాణి దంపతుల కూతురు ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ వైష్ణవిని 2019 ఫిబ్రవరి 15న గౌతమ్ వివాహం చేసుకున్నారు. ఆమె హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా వైద్య సేవలు అందిస్తున్నారు. వీరికి కవలలు అనన్య, ఆరాధ్య ఉన్నారు.

## విద్యాభ్యాసం..

గౌతమ్ ప్రాథమిక, హైస్కూల్ విద్యాభ్యాసం కాజీపేటలోని సెయింట్ గాబ్రిల్ హైస్కూల్ లో కొనసాగింది. గుంటూరులోని వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే ఎంసెట్ లో మంచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీట్ సాధించారు. 2013లో గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆ వెంటనే గౌతమ్ వైద్య కోర్సులో పీజీ సీటు కూడా సాధించారు. 2016లో ఖమ్మంలోని మమత మెడికల్ వైద్య కళాశాలలో ఎండీ (జనరల్) పూర్తి చేశారు. విద్యార్థి దశలో గౌతమ్ కు క్రికెట్, చెస్, టెన్నిస్ తో పాటు పెయింటింగ్ లో ప్రావీణ్యం ఉంది. పియానో, గిటార్ కూడా వాయిస్తారు. వైద్య విద్యార్థిగా తన ప్రస్తానాన్ని కొనసాగిస్తూనే వివిధ రంగాల్లో ఆయన చూపిన ప్రతిభకు అనేక బహుమతులు ఆయన సొంతం అయ్యాయి. అప్పటినుంచే ఆయనకు ఆల్ రౌండర్ గా ప్రత్యేక గుర్తింపు లభించింది.

## ఉద్యోగ ప్రస్థానం..

డాక్టర్ వైద్యం గౌతమ్ పీజీ వైద్య విద్య పూర్తి కాగానే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఏడాది పాటు సీనియర్ రెసిడెంట్ గా వైద్య సేవలు అందించారు. 2017 నుంచి ఆరేళ్ల పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఎంజీఎంలోనే పనిచేశారు. 2023 మే నెలలో ఆయనకు ఉద్యోగం రెగ్యూలర్ అయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎంజీఎం ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సమర్ధవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వ వైద్యుడిగా పేదలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రతిరోజు నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తూ పేదల వైద్యుడిగా గౌతమ్ పేరు గడించారు. సతీమణి డాక్టర్ వైష్ణవి కూడా ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో సర్జరీలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. హనుమకొండ విజయ టాకీస్ రోడ్డు, కాకాజీ కాలనీలో 2022 ఏప్రిల్ 27న సతీమణి వైష్ణవితో కలిసి గౌతమ్ అభయ హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ దంపతులు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజలందరితో ప్రశంసలు అందుకుంటున్నారు.



## సేవా తత్పరుడు..

డాక్టర్ గౌతమ్ విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నారు. తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ లో డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ లో ట్రెజరర్ గా, సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ప్రస్తుతం ప్రెసిడెంట్ గా పనిచేస్తున్నారు. లయన్స్ క్లబ్ లో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డుతో పాటు, బెస్ట్ అక్రిలిక్ పెయింటింగ్ ను పొందారు. 2019లో వైద్య పురస్కారం అందుకున్నారు. అలాగే పద్మశాలి సంఘంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి అనేక పురస్కారాలు అందుకున్నారు.









## టాలీవుడ్‌లో బాలీవుడ్ దర్శకుడు ఎంట్రీ

అడివిశేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం డెకాయిట్. ఈ సినిమాకు షానీల్ డియో కథనందిస్తూ



దర్శకత్వం వహిస్తున్నాడు. లవ్ రివేంజ్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక అప్‌డేట్ పంచుకున్నారు. ఈ సినిమాతో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా అనురాగ్ కశ్యప్ ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ గమనిస్తే.. అనురాగ్ ఇందులో స్వామిమాల ధరించిన పోలీస్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు హిందీలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అడివిశేష్, మృణాల్ ఠాకూర్ మొదట ప్రేమికులుగా ఆ తర్వాత బద్ధ శత్రువులుగా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

# ఎరక్కపోయి.. ఇరుక్కుపోయారు

### వాణిజ్య ప్రకటనలు తెచ్చిన కష్టాలు



కాజల్, తమన్నాలను విచారించనున్న పోలీసులు కాసులకు ఆశపడి స్టార్స్ చేసే కొన్ని ప్రకటనలు వారికి ఊహించని కష్టాలను కొని తెచ్చిపెడతాయి. ఇప్పటికే పలువురు హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా ఇలాంటి సమస్యలలో చిక్కుకున్నారు. తాము ప్రచారం చేసే ప్రొడక్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ముందు ఊహించకోకుండా వీరు ఆయా ప్రకటనల్లో పాల్గొనడమే ఇందుకు కారణం. నిజానికి బ్రాండ్ అంబాసిడర్ గా అంగీకార పత్రాన్ని సమర్పించేప్పుడే ఆ ప్రొడక్ట్ లేదా ప్రాజెక్ట్ వల్ల వినియోగదారులు నష్టపోతే తమకు సంబంధం లేదనే క్లాజ్ ను చేర్చికానీ కొందరు సైన్ చేయడం లేదు. కాని అంతలోతుగా వివరాలను అధ్యయనం చేయకుండా చాలామంది హీరోయిన్లు రెమ్యూనరేషన్ కు ప్రాధాన్యం ఇచ్చి... వాణిజ్య ప్రకటనలు చేసేసి ఆపైన ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఆ జాబితాలోకి కాజల్ అగర్వాల్, తమన్నా భాటియా పేర్లు కూడా చేరాయి. పుదుచ్చేరికి చెందిన ఓ సంస్థ క్రిప్టో కరెన్సీ లో పెట్టుబడులు పెడితే అధిక లాభం పొందవచ్చంటూ కొందరిని తన బుట్టలో వేసుకుంది. దాదాపు పదిమంది ఈ సంస్థలో 2.40 కోట్లను మదుపు చేశారు. అయితే ఆ తర్వాత తాము మోసపోయామంటూ ఘొల్లుమంటున్నారు. ఈ విషయమై లాస్ పేట్టైకు చెందిన అశోకన్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంబంధిత వ్యక్తులను పోలీసులు విచారించడం మొదలు పెట్టారు. ఈ సంస్థ 2022లో కోయంబత్తూరులో కార్యాలయం ప్రారంభించినప్పుడు అతిథిగా తమన్నా హాజరైంది. అలానే ఆ తర్వాత మహాబలిపురంలోని ఓ స్టార్ హోటల్ లో జరిగిన ప్రోగ్రామ్ కు కాజల్ వెళ్ళింది. ఇంతేకాకుండా ముంబైలోని ఒక ఓడలో భారీ పార్టీని సదరు సంస్థ నిర్వహించి, అక్కడ కూడా వేలాది మంది నుండి బోలెడంత డబ్బును సేకరించింది. ఇప్పటికే ఈ సంస్థకు చెందిన నితీశ్ జెయిన్, అరవింద్ కుమార్ అనే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ కార్యక్రమాలలో పాల్గొన్న కాజల్, తమన్నాలనూ కూడా విచారించాలని పోలీసులు భావిస్తున్నారట. తమ సమయాన్ని లక్షల రూపాయల్లోకి మార్చేసుకుని, సొమ్ము చేసుకుంటున్న కథానాయికలు... ఇప్పుడు పోలీసుల విచారణ కోసం సమయం కేటాయించాల్సిన రావడం చిత్రమే.






## మహేష్ న్యూలుక్

### సోషల్‌మీడియాలో వైరల్

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబీ29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక ఈ సినిమా అప్‌డేట్‌ల కోసం అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహేశ్ కొత్త లుక్‌కి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజమౌళితో పాటు ఈ సినిమా కోసం మహేశ్ కూడా బాగా కష్టపడుతున్నారు. ఇప్పటికే జుట్టు గడ్డం పెంచేసి లుక్స్ మొత్తం మార్చేసిన మహేశ్ తాజాగా జిమ్‌లో వర్కౌట్స్? చేస్తున్నాడు. అయితే మహేశ్ జిమ్‌లో ఎక్సర్‌సైజ్ అనంతరం అద్దం ముందుకు వెళ్లి తన లుక్‌ని చూసుకుని బయటకు వెళ్లే వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో జుట్టు మొత్తం వదిలేసి రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. దీంతో ఈ వీడియో ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్?లోకి దూసుకెళ్లింది.

## ప్రభాస్‌తో రెండు గంటలు కష్టమేనా..?



ప్రభాస్‌తో సింగిల్ సినిమా చేయలేకపోతున్నారా మన దర్శకులు..? రెబల్ స్టార్‌తో రెండున్నర గంటల సినిమా చేయడం అంత కష్టమా..? ప్రభాస్ డేట్స్ ఇస్తే చాలు.. కనీసం రెండు పార్ట్స్ ఉన్న సినిమానైనా చేయాలంటూ ముందుగానే బ్లైండ్‌గా ఫిక్స్ అయిపోతున్నారా..? అసలేం జరుగుతుంది..? మరి ఇప్పుడే సినిమా 2 పార్ట్స్‌గా రాబోతుంది..? ప్రభాస్‌తో పెద్ద స్పాన్ ఉన్న సినిమాలే కాదు.. పెద్ద కథలు కూడా రాసుకుంటున్నారు మన దర్శకులు. కనీసం 5 గంటల సినిమా ప్లాన్ చేసుకుంటున్నారు. బడ్జెట్ వర్కవుట్ అవుతుంది కదా అని.. ప్రతీ సినిమాను 2 భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే బాహుబలి 2 పార్ట్స్‌గా వచ్చింది.. కల్కి 2, సలార్ 2 సెట్స్‌పైకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభాస్ సినిమాలకు తక్కువలో తక్కువ 300 నుంచి 500 కోట్ల వరకు బడ్జెట్ పెడుతున్నారు నిర్మాతలు. అంత వర్కవుట్ అవ్వాలంటే 2 పార్ట్స్ ఉండాల్సిందే అంటున్నారు దర్శకులు. ప్రస్తుతం రాజా సాబ్, హను రాఘవపూడి ఫౌజీ సినిమాలను ఒకేసారి పూర్తి చేస్తున్నారు ప్రభాస్. ఇందులో రాజా సాబ్ 2 పార్ట్స్ సినిమాగా ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. వరసగా సీరియస్ సినిమాలు చేస్తున్న ప్రభాస్.. మారుతితో తక్కువ బడ్జెట్‌లో సరదా సినిమా చేయాలని రాజా సాబ్ షురూ చేసారు. కానీ రానురాను ఇది కూడా భారీ బడ్జెట్ అయిపోయింది. దీనికోసం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీనికి సైతం మారుతి సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారంటూ టాక్ వినిపిస్తుందిప్పుడు.

# మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

◆ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌కు లేఖ ద్వారా ఈ అనుమతిని తెలియజేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి విమానాశ్రయ ప్రాధికార సంస్థ (Airport Authority of India)చేసిన అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీ సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జీఎంఆర్ సంస్థ యాజమాన్యంతో చర్చించి, బోర్డులో చేర్చి ఎన్‌ఓసీ మంజూరు చేయించారని తెలిపారు. హెచ్‌ఏఐఎల్ తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం నిర్వహించి, మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి 150 కిలోమీటర్ల నిబంధనను సవరించి ఎన్‌ఓసీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పుడు ఈ ఎన్‌ఓసీని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. విమానాశ్రయ ప్రాధికార సంస్థ (AAI) UO నోట్ నెం. PLG/501/Warangal/2025/80 ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం 05.12.2024, 17.11.2024 తేదీలలో పంపిన లేఖల ఆధారంగా, హైదరాబాదు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (HIAL) మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' (NOC) జారీ చేసినట్లు పేర్కొంది. సంబంధిత లేఖను మంత్రి విడుదల చేశారు. మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి అవసరమైన 253 ఎకరాల అదనపు భూమిని తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధికార సంస్థ (AAI)కి అప్పగించేందుకు 205 కోట్ల రూపాయలు ఇప్పటికే విడుదల చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఎయిర్ పోర్ట్‌కు కావాల్సిన అన్ని అనుమతులు లభించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

## వరంగల్ ఎంపీ కడియం కావ్య హర్షం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరునుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు స్పష్టం చేశారు. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఎంపీ డా.కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలసి కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు లేఖలు అందజేసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని వెల్లడించారు. గత పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌వోసీ అడ్డంకిని రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, బోర్డులో పెట్టి ఎన్‌వోసీ ఇచ్చేలా చేసిందన్నారు. దీంతో హెచ్‌ఏఐఎల్ తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను సవరిస్తూ ఎన్‌వోసీ ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇప్పటికే మామునూరు ఎయిర్ పోర్టు భూసేకరణకు తెలంగాణ సర్కార్ 205 కోట్లు విడుదల చేసిందని తెలియజేశారు. భూ సేకరణ పనులు పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. త్వరలోనే విమానాల రాకపోకలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి అదేవిధంగా రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులకు ఎంపీ కృతజ్ఞతలు తెలియజేశారు.





## నగరంలో నాయి బ్రాహ్మణుల ఆందోళన

**వరంగల్ వాయిస్, పోచమ్మ మైదాన్ :** గ్రేటర్ వరంగల్ నాయి బ్రాహ్మణులు పోచమ్మ మైదాన్ 80 ఫీట్ల రోడ్డులో ఇతర సామాజిక వర్గానికి (మైనార్టీ) చెందిన వ్యక్తులు సెలూన్ షాపును ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుసుకున్న నగర నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కస్తూరి సతీష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నగర నాయి బ్రాహ్మణులు ఆందోళనకు దిగారు. మా జీవనోపాధి అయిన మా కులవృత్తిని ఇతర సామాజిక వర్గానికి చెందినవారు చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయి బ్రాహ్మణ కమిటీ సభ్యులు రాజేందర్, దశరథం, సతీష్ కుమార్, మధుసూదన్, సందేటి వేణు, నాగరాజు, కర్ణాకర్, కృష్ణ, సదానందం, రాజేష్, యుగేందర్, కన్నయ్య, ఉపేందర్, రమేష్, రాజు, కిరణ్, రవీందర్, సహదేవుడు, మహేష్, రవి చందర్, శ్రీకాంత్, నవీన్, భిక్షపతి, వెంకట్, పూర్ణచందర్, వెంకటయ్య, యాదగిరి, వెంకట్, దామోదర్, సాంబమూర్తి, శ్రవణ్, సురేందర్, భాస్కర, ప్రశాంత్, నవీన్, జెట్టిసాగర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రయోగశాలలు పాఠశాలల మెదళ్లు

### టీజీఓ రాష్ట్ర ప్రచారం కార్యదర్శి అస్నాల శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, బచ్చన్నపేట :** సైన్స్ అంటే సత్యమని అది నిరూపణకు నిలబడుతుందని ప్రముఖ విద్యావేత్త రచయిత , తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి అస్నాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బచ్చన్నపేటలో హరిచరణ్ తేజ వారి తండ్రి రాఘవరాజు స్మరణలో అందించిన యాభై వేల రూపాయల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ప్రయోగశాలను రాఘవరాజు కూతురు శరత్కల తో కలసి ప్రారంభించారు. సైన్స్ డే, సీవీ రామన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కీలకోపన్యాసం చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రయోగశాలలు పాఠశాల మెదళ్లుగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహ రెడ్డి, మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు తుర్కపల్లి యాదగిరి, బాలరాజు, నిర్మల, పృథ్వీరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిట్ వరంగల్‌లో స్ప్రింగ్‌స్ప్రీ–25 ప్రారంభం

◆ హాజరైన హాస్యనటుడు బ్రహ్మానందం
◆ కష్టపడి పనిచేస్తే విజయాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్‌ఐటీ వరంగల్ వార్షిక సాంస్కృతిక ఉత్సవం స్ప్రింగ్‌స్ప్రీ–25 శుక్రవారం మధ్యాహ్నం సంస్థ ఆడిటోరియంలో సినీ హాస్య నటుడు డాక్టర్ కె. బ్రహ్మానందం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీనివాస చార్య, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి. శ్యామ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ (సాంస్కృతిక) స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ హాజరయ్యారు. తొలుత దీప ప్రజ్వలన తో ప్రారంభమైన ఈ వేడుక విద్యార్థుల ఉత్సాహాన్ని మరింత పెంచింది. అనంతరం డాక్టర్ కె. బ్రహ్మానందం విద్యార్థులతో మాట్లాడారు. ఎన్‌ఐటీ వరంగల్‌లో తాను పొందిన ఆదరణకు ఆనందం వ్యక్తం చేస్తూ, శ్రోతల్లో ఉన్న ప్రతిభాశాలి విద్యార్థులలో భవిష్యత్తులో కలామ్స్, బ్రహ్మానందం లు ఉండబోతున్నారని తెలిపారు. అలాగే, విద్యార్థులు ఆరోగ్యాన్ని ప్రధానంగా పరిగణించాలన్న ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యకరమైన ఆలోచనలు ఉన్న మనిషి మంచి పనులు చేయగలడని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిరంతరం అనుసరించి, దృఢ సంకల్పం, కష్టపడి పనిచేస్తే విజయాన్ని తప్పక సాధించగలరని ఆయన సూచించారు. చివరగా, "మంచి చేద్దాం, మంచిగా జీవిద్దాం, ఆనందంగా ఉండండి" అని సందేశం ఇచ్చారు. సాంస్కృతిక ప్రతిభకు వేదిక సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేందుకు స్ప్రింగ్‌స్ప్రీ'25 వేదికగా నిలుస్తున్నది. దేశం నలుమూలల నుండి విద్యార్థులు పాల్గొని సంగీతం, నృత్యం, నాటకం, ఇతర సాంస్కృతిక పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఎన్‌ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి స్ప్రింగ్‌స్ప్రీ'25 ఉత్సవానికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ వేడుకలో తమ విశేష ప్రతిభను ప్రదర్శించి, ఎన్‌ఐటీ వరంగల్ ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు.



## సమిష్టిగా పోరాడుదాం.. అండగా నిలబడుదాం...

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జర్నలిస్టులు అనేక సమస్యలకు గురవుతున్నారని జనని హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడు జయపాల్, కోశాధికారి దామోదర్, ఆర్గనైజర్ వెంకన్న తెలిపారు. శుక్రవారం జర్నలిస్టుల జనని హౌసింగ్ సొసైటీ మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి కోసం ఒకరు, ఒకరి కోసం అందరూ సమిష్టిగా నిలబడాలనే ఉద్దేశ్యంతో జర్నలిస్టుల భవిత కోసం సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీలో ఉన్న అందరికీ చేయూతగా ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ ముందుకు సాగాలని, సమాజంలో జర్నలిస్టుల సంఘటిత శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, రిజిస్ట్రేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com